## మహిళా ఉద్యోగుల క్రీడలు ప్రారంభం

చెస్ ఆడుతున్న ములుగు కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

ములుగురూరల్, మార్చి 4 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో సోమవారం అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి కలెక్టర్ ఇలాత్రిపాఠి మహిళా ఉద్యోగ క్రీడలను ప్రారంబించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ చెస్, షటిల్ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో చెస్, క్యారమ్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, స్కిప్పింగ్, షటిల్, టెన్నికాయిట్, అంత్యాక్షరి, టగాఫ్ వార్ క్రీడలను చేపట్టినట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులందరూ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో స్వర్ణలతలెనినా, జిల్లా మైనార్టీ అధికారి ప్రేమ లత, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## సమాజ హితంలో మహిళల పాత్ర గొప్పది

మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

కృష్ణకాలనీ, మార్చి 4 : సమాజ హితంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే జయరాంరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలు, రోజువారీ పనులను ఎంతో ఓపికగా నిర్వర్తిస్తారన్నారు. సమాజంలో మహిళలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో పోక్సో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ విష్ణువర్ధన్‌రావు, సఖీ కేంద్రం నిర్వాహకురాలు గాయత్రి, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మంగపేట, మార్చి 4 : మండలంలోని శనగకుంటకు చెందిన పెద్దల దేవేందర్ ఇల్లు ఈనెల 3న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోగా, బాధిత కుటుంబాన్ని సోమవారం ములుగు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి పరామర్శించారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.25వేల తక్షణ సహాయ చెక్కు, యాబై కిలోల బియ్యం అందజేశారు. ఆయన వెంట ఐటీడీఏ ఎస్‌వో రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ యేసుపాదం ఉన్నారు. అలాగే ఎస్సై రవికుమార్ బాధిత కుటుంబానికి రూ.పదివేల విలువైన సరుకులు, దుస్తులు అందజేశారు.

## హెచ్‌పీఎస్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

ఏటూరునాగారం, మార్చి 4 : 2024-25 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్ రామంతపూర్, బేగంపేటలోని ఇంగ్లిష్ మీడియం పబ్లిక్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్ర మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి ఆరుగురు విద్యార్థులకు అవకాశం ఉంటుందని తెలిపారు. బాల, బాలికలకు సమానంగా సీట్లు కేటాయించినట్లు చెప్పారు. విద్యార్థులను లక్కీ డీప్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 11 సాయంత్రం 5 గంటలలోపు ఐటీడీఏ కార్యాలయంలోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారికి దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. 2017 జూన్ 1 నుంచి 2018 మే 31లోగా జన్మించిన వారికి అవకాశం ఉంటుందన్నారు. తహసీల్దార్‌చే ధృవీకరణ పత్రాలు ఉండాలని చెప్పారు.

## భూపాలపల్లి ఆర్డీవోగా మంగీలాల్ బాధ్యతలు

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీవో మంగీలాల్

భూపాలపల్లి రూరల్, మార్చి 4 : భూపాలపల్లి ఆర్డీవోగా మంగీలాల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భద్రాచలంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన జిల్లాకు బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన అనంతరం కలెక్టర్ భవేశ్ మిశ్రాను మంగీలాల్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# ప్రజల పక్షాన పోరాడుతా

- కక్షపూరిత రాజకీయాలను సహించేదిలేదు
- ప్రభుత్వం 420 హామీలను నెరవేర్చాలి
- కార్యకర్తలకు అండగా ఉంటా
- పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

రేగొండ, మార్చి 4 : ప్రజా తీర్పును గౌరవిస్తూ వారి పక్షాన ప్రతిపక్ష నేతగా పోరాడుతానని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. కక్షపూరిత రాజకీయాలను ఇక నుంచి సహించేది లేదని హెచ్చరించారు. హనుమకొండ జిల్లా పరకాలలోని జీఎంఆర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన రేగొండ, గోరికొత్తపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన 420 హామీలను అమలు చేయాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని, వారికి అండగా ఉంటానన్నారు. చట్ట విరుద్ధంగా పనులు చేసే ఏ అధికారిని వదిలిపెట్టేది లేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను రద్దు చేయడమే కాకుండా, చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ కక్షపూరిత రాజకీయాలు చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడువక ముందే కాంగ్రెస్ కరెంట్ కోతలు విధిస్తున్నదని, సాగు, తాగునీటి సరఫరా చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని మరిచి సొంత పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధితో పాటు పాలనా సౌలభ్యం కోసం గోరికొత్తపల్లి మండలం ఏర్పాటు చేశానని, అయినా తనను ఓటమిపాలు చేశారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని గండ్ర పిలుపునిచ్చారు.

సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు అంకం రాజేందర్, మటిక సంతోష్, జడ్పీటీసీ సాయిని విజయ, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్‌రావు, వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, నాయకులు ఇంగె మహేందర్, కొల్గూరి రాజేశ్వర్‌రావు, కోలెపాక భిక్షపతి, రహీంపాషా, కుందూరు విద్యాసాగర్‌రెడ్డి, దగ్గు వెంకటేశ్వర్‌రావు, జాపాక నీలాంబరం, పాతపెల్లి సంతోష్, అంబాల చందు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

**భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠి**

ములుగు రూరల్ : సమస్యలు తెలుసుకుంటున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్, మార్చి 4 : ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం ఆయా కలెక్టరేట్లలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూపాలపల్లిలో డబుల్ బెడ్రూం, భూ సమస్యల పరిష్కారం, పెన్షన్ల కోసం 52, ములుగులో రెవెన్యూ, ఇతర సమస్యలకు సంబంధించి 35 అర్జీలు వచ్చాయని, వీటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించామని కలెక్టర్లు తెలిపారు. అలాగే హైదరాబాద్‌లోని ప్రజా భవన్ నుంచి సిఫారసు చేసిన సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ నెల 7న ములుగు నియోజకవర్గ సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొననున్నారని, అన్ని శాఖల అధికారులు నివేదికలను మంగళవారం సమర్పించాలని ఆదేశించారు. ములుగు డీఆర్డీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, డీడబ్ల్యూవో స్వర్ణలతాలెనినా, డీపీవో స్వరూప, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మిర్చి కల్లాలోకి వెళ్లి పోలియో చుక్కలు

పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి మధుకర్

వాజేడు, మార్చి 4 : వాజేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గ్రామాల్లో మొబైల్ వైద్య బృందం సోమవారం మిర్చి కల్లాల్లోకి వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేసింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కూలీలు పిల్లలతో మిర్చి కల్లాల వద్ద ఉండగా వారు అక్కడికి వెళ్లారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా చుక్కలు వేయించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మధుకర్, హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ శేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ లకాన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**పోలియో చుక్కలు వేయాలి**

మహదేవపూర్ : ఐదేండ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాదేవి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలోని సూరారంలో నిర్వహణ తీరును పరిశీలించి చిన్నారికి పోలియో చుక్కలు వేశారు. ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు. ఆమె వెంట డాక్టర్ విజయ్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ మాషూక్ అలీ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు అరుదైన గుర్తింపు

- విశ్వగురు ప్రపంచ రికార్డులో చోటు
- స్వాతంత్ర్య వేడుకల్లో ప్రదర్శించిన జాతీయ జెండాకు అవార్డు
- హెచ్ఎంను అభినందించిన ఉపాధ్యాయులు

బొల్లం సతీశ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

మహదేవపూర్, మార్చి 4 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. గతంలో ఇదే పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వర్తించిన బొల్లం సతీశ్ 2022లో 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం 75 అడుగుల జాతీయ జెండాను తయారు చేయించారు. ఈ జెండాతో మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రదర్శన జిల్లాలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయితే గతేడాది స్వాతంత్ర్య దినోత్సవ సంబురాల్లో భాగంగా ఆగస్టు 14న 'విశ్వగురు ప్రపంచ రికార్డు' ఆధ్వర్యంలో నిర్వహించిన 'అశోక ధర్మచక్రం.. 24 ఆకుల విలువల ప్రతిజ్ఞ' కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ప్రదర్శనను పాఠశాల పేరిట రికార్డులో చేర్చుతున్నట్లు నిర్వాహకులు ప్రకటించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

విభిన్నంగా ఆలోచించి తన సొంత ఖర్చులతో జాతీయ జెండాను తయారు చేసి ప్రదర్శించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చిన సతీశ్‌ను పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం సోమవారం శాలువాతో సత్కరించింది. కాగా, తన కృషికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా సతీశ్ కృతజ్ఞతలు తెలిపారు.

## పగిడిద్దరాజు జాతరను విజయవంతం చేయాలి

జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లచ్చుపటేల్, పూజారులు, సర్పంచ్, విద్యార్థి సంఘం నాయకులు

తాడ్వాయి, మార్చి 4 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం యాపలగడ్డ గ్రామంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే అరెం వంశీయుల ఇలవేల్పు అయిన పగిడిద్దరాజు జాతరను విజయవంతం చేయాలని మేడారం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అరెం లచ్చుపటేల్ పిలుపునిచ్చారు. సోమవారం సమ్మక్క-సారలమ్మ సన్నిధిలో జాతర వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా అరెం వంశీయులు జాతర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సమ్మక్క పూజారులు సిద్దబోయిన స్వామి, సిద్దబోయిన రమేశ్, సిద్దబోయిన రాజు, తాడ్వాయి సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, సోలం నందు, చింత సతీశ్, ఈక రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ములుగురూరల్, మార్చి 4 : మహిళలు వివిధ వృత్తులు, వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా ఎదగాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి జే ఓంకార్ అన్నారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో భాగంగా మహిళలతో సమావేశం నిర్వహించారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుండటం వల్ల సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, సఖీ సెంటర్ నిర్వాహకులు కల్పన, మౌనిక, స్రవంతి, చైల్డ్‌లైన్ అధికారులు నరేశ్, రజినీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ప్రజా పాలన సేవా కేంద్రాన్ని వినియోగించుకోవాలి



ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ బన్సోడ రాణిబాయి

మహదేవపూర్, మార్చి 4 : ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీపీ బన్సోడ రాణిబాయి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా పాలనలో అందజేసిన అర్జీల్లో తప్పులుంటే సరిచేసేందుకు, అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం సేవా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రసాద్, ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, అరుణ్, శ్రీకాంత్, కార్యదర్శులు రాజ్‌కుమార్, మంజూర్, రాజు, అంజలి, దామోదర్, రమేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

**గోవిందరావుపేటలో..**

గోవిందరావుపేట : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని జడ్పీ ఫ్లోర్ లీడర్ తుమ్మల హరిబాబు సోమవారం ప్రారంభించారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా గతంలో దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జవహర్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాసరావు, ఉమా, ఏడు కొండలు, తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీవో సాజిదాబేగం, సీనియర్ అసిస్టెంట్ తదితరులు ఎక్బాల్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

I, **PULI AMITHA** (New Name), previously called **PITTALA AMITHA** (Old Name), R/o. 2-10-678/2, Teachers Colony, Phase-I, Hanamkonda Mandal, Hanumakonda District - 506001, T.S., India. solemnly declare

**PLOT FOR SALE**



★మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు 2 వేలకు 1గజం భూమి, యాదగిరిగుట్ట దగ్గర @ ఆలేరు, జీడికల్లు రామాలయ, ప్రసిద్ధ శివాలయం దగ్గర్లో, స్పాట్ రిజి. 100% వాస్తు. Cont: 9030769178.
NTW-00

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

## పురాతన శివాలయం పరిశీలన

రేగొండ, మార్చి 4 : మండల కేంద్రంలోని కాకతీయుల కాలంనాటి పురాతన శివాలయాన్ని మండల ప్రత్యేక అధికారి సామ్యూల్ సోమవారం పరిశీలించి శివరాత్రి సందర్భంగా ఏర్పాట్లు చేయాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. నాలుగేళ్ల క్రితం ఈ ఆలయం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి దీని అభివృద్ధిని ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామస్తులే నిత్యం ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ఇటీవల ఆలయ అభివృద్ధి విషయమై స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఇక్కడ శివాలయం ఉన్న సమాచారం తెలుసుకున్న ప్రత్యేకాధికారి సందర్శించారు. ఆయన వెంట కార్యదర్శి కుమార్, కారోబార్ రమేశ్, గ్రామస్తులు తిరుపతిరెడ్డి, లింగారెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.

## నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు



మోటర్లను పరిశీలిస్తున్న అధికారులు

గోవిందరావుపేట, మార్చి 4 : యాసంగిలో రైతులు అక్రమంగా నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని నీటి పారుదల శాఖ డీఈఈ శ్రీనివాస్ అన్నారు. లక్నవరం సరస్సు కింద ప్రస్తుత యాసంగిలో కోట కాల్వ కింద 1,900 ఎకరాల సాగుకు అనుమతి ఇచ్చామన్నారు. ఈ క్రమంలో కొంత మంది రైతులు కాల్వలకు మోటర్లు పెట్టి నీటిని మళ్లించి వరి సాగు చేస్తున్నారని వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు మోటర్లు, పైపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈఈ హర్షత్ ఉన్నారు.

## బాలికల డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

ఏటూరునాగారం, మార్చి 4 : స్థానిక గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను గురుకుల సెట్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష కోసం ఏప్రిల్ 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఏప్రిల్ 24న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

## యునైటెడ్ క్రిస్టియన్ సొసైటీ నియామకం

మంగపేట, మార్చి 4: యునైటెడ్ క్రిస్టియన్ సొసైటీ ఫర్ క్రైస్ట్ ఆఫ్ మంగపేట కమిటీని సోమవారం పాస్టర్ల ఆధ్వర్యంలో నియమించారు. అధ్యక్షుడిగా ఎల్లేశ్ (క్రీస్తుదాసు), ప్రధాన కార్యదర్శిగా నాలి దాసు, కోశాధికారి వీ దేవరాజు, ఉపాధ్యక్షుడిగా వీ తిమోతి, సంయుక్త కార్యదర్శిగా టైటస్, ముఖ్య సలహాదారుగా యోహన్, ఎగ్జిక్యూటివ్ కమిటీగా జానేశ్, భాస్కర్, పరిశుద్ధరావు, గౌరవ అధ్యక్షులుగా కే ఆదాం, ఎస్ విజయరాజును ఎంపిక చేశారు.

## డీఏ బకాయిలు విడుదల చేయాలి

ములుగురూరల్, మార్చి 4 : ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు ప్రభుత్వం డీఏ బకాయిలను చెల్లించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్చి 2వ వారంలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను న్విహించేందుకు అడ్డంకిగా ఉన్న టెట్‌పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులతో సీఎం ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ, విద్యారంగ రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

# టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**ములుగు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ**

ములుగురూరల్, మార్చి 4 : పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో 3,092 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, 200 మంది ఇన్విజిలేటర్లు, 21 మంది చీఫ్ సూపర్‌వైజర్స్, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల లోపలికి ఫోన్లు అనుమతి లేదని, ఇన్విజిలేటర్లు కూడా ఫోన్ ఉపయోగించొద్దని సూచించారు. పోలీస్ సిబ్బందికి పరీక్ష హాల్‌లో లోపలికి అనుమతి లేదన్నారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఈవో పాణిని, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, డీపీవో స్వరూపరాణి, సైన్స్ అధికారి జయదేవ్, శంకర్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు క్రీడా పోటీలు

**సింగరేణి ఏరియా అధికార ప్రతినిధి తుకారాం**

భూపాలపల్లి రూరల్, మార్చి 4 : సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు భూపాలపల్లి సింగరేణి ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం తెలిపారు. సోమవారం భూపాలపల్లి జీఎం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి సేవా సమితి సభ్యులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 7 వరకు భూపాలపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల్లోని మహిళలు, సేవా సమితి సభ్యులకు బంగ్లాస్ ఏరియాలో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున జీఎం బళ్లారి శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో స్పోర్ట్స్ సూపర్ వైజర్ పర్స శ్రీనివాస్, సేవా సమితి కో-ఆర్డినేటర్ కందికట్ల ప్రవీణ్, కమ్యూనికేషన్ సెల్ కో-ఆర్డినేటర్ మల్లిక్ ఉత్తమ్‌కుమార్, సెక్రటరీ లక్ష్మి, సభ్యులు అరుణ, కవిత, జ్యోతి, రాజేశ్వరి, రజిత, నాగలక్ష్మి, ఉమ పాల్గొన్నారు.

## గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడు మృతి



రాజు (ఫైల్)

వాజేడు, మార్చి 4 : స్నానం చేసేందుకు గోదావరిలోకి దిగిన యువకుడు నీటిలో గల్లంతై మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం.. మండలంలోని అయ్యవారిపేట గ్రామానికి చెందిన సుంకరి రాజు(చింటు) (19) ఇసుక ర్యాంపులో పనికోసం వెళ్లాడు. మధ్యాహ్న భోజన సమయంలో అక్కడి వారితో కలిసి స్నానం చేసేందుకు గోదావరి నదిలోకి దిగాడు. ఈ క్రమంలో ప్రవాహంలో కొట్టుకుపోతుండగా అక్కడ ఉన్న వారు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. పేరూరు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. రాజు మృతితో అయ్యవారిపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## గిరిజన దర్బార్‌లో వినతులు

ఏటూరునాగారం, మార్చి 4 : ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గ్రామాలకు చెందిన గిరిజనులు తమ వినతులను పీవో చిత్ర మిశ్రాకు అందజేశారు. సుమారు 29 దరఖాస్తులను గిరిజనులు సమర్పించారు. గిరిజన దర్బార్‌లో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించే విధంగా చూడాలని దర్బార్‌లో డీడీ పోచం, ఏవో దామోదర్‌స్వామి, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్, ఎస్‌వో రాజ్‌కుమార్, జీసీడీవో సుగుణ, ఆఫీస్ మేనేజర్ శ్రీనువాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో అన్నదానం

భూపాలపల్లి రూరల్, మార్చి 4 : జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రిలో రోగుల బంధువులకు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ అటెండెంట్లకు ప్రతిరోజు ఉచితంగా ఆహారాన్ని అందజేస్తామన్నారు.

మాట్లాడుతున్న సీడీపీవో మల్లీశ్వరి

## ఘనంగా మహిళా దినోత్సవం

తాడ్వాయి, మార్చి 4 : మండలకేంద్రంలోని అంగన్‌వాడీ-1 సెంటర్‌లో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సీడీపీవో మల్లీశ్వరి హాజరై మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. ఆర్థిక సమానత్వం సాధించితే లింగ సమానత్వం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయ, అంగన్‌వాడీ టీచర్లు జమునా రాణి, ఆదిలక్ష్మి, రుక్మిణి, రజిత, ఎస్‌హెచ్‌జీ ప్రెసిడెంట్ కొట్టెం మల్లికాంబ, వీవో లీడర్ సరిత, మహిళలు పాల్గొన్నారు.

## 'ఉపాధి' పనులను పరిశీలించిన ఏపీవో

మల్హర్, మార్చి 4 : మండలంలోని తాడిచర్ల పెంజురువులో ఉపాధి హామీ పనులను సోమవారం ఏపీవో హరీశ్ పరిశీలించారు. మండలంలో జాబ్ కార్డులున్న వారందరూ 100 రోజుల పని దినాలను వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్య, సుమలత ఉన్నారు.

## నేడు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

గణపురం, మార్చి 4 : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండలాధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరు కానున్నారని, మండలంలోని బీఆర్ఎస్, టీబీజీకేఎస్, యూత్, మహిళా నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

మల్హర్, మార్చి 4 : రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం, కస్తూర్బా పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించనున్నారు. దీంతోపాటు రహదారి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కాగా, ఆయా ప్రాంతాలను అదనపు కలెక్టర్ సందర్శించి అవసరమైన ఏర్పాట్ల కోసం అధికారులకు సూచనలిచ్చారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి అవినాష్, తహసీల్దార్ రవికుమార్ తదితరులున్నారు.